# లవ్ స్టోరీ

బయట కురుస్తున్న వానకి, వరండా గ్రిల్ మీదల్లుకున్న సన్నజాజి తీగెలు తడిసి పచ్చగా మెరుస్తున్నాయి. కిటికీలో నుండి వానను చూస్తూ శ్రీమతి అందించిన కాఫీ తాగుతున్నాను. వంట గదిలో పనిమనిషికేదో పురమాయిస్తోంది శ్రీమతి. ఎదురుగా కుర్చీలో కూర్చున్న అపూర్వ, నేనిచ్చిన ఎక్సర్‌సైజ్‌ని పూర్తి చేయడంలో నిమగ్నమై వుంది. వానలో తానమాడిన సన్నజాజిపూవులా స్వచ్ఛంగా వుందామె. మా ప్రక్క పోర్షన్‌లో వుంటున్న ఇంజనీరుగారి అమ్మాయి ఈ అపూర్వ. రీడర్స్ డైజెస్ట్‌లాంటి అంతర్జాతీయ పత్రికల్లో సంయుతం ప్రచురించబడ్డ నా వ్యాసాలు కొన్ని చదివిన ఆయన ఇంటర్మీడియెట్ చదువుతున్న అపూర్వకి ఇంగ్లీషు గ్రామర్ కోచ్ చేయమని అభ్యర్థిస్తే సరే అన్నాను. రెండు నెలలుగా ఇలా ఉదయంపూట ఓ గంటసేపు, నాకు తెలిసిందేదో ఆమెకు చెబుతున్నాను. ఆ అమ్మాయి నన్ను ఒకోసారి అంకుల్ అని, ఒక్కోసారి 'సర్' అని పిలుస్తూంటుంది.

ఈ మధ్య అపూర్వ ప్రవర్తనలో ఏదో 'మార్పు' వచ్చినట్లనిపిస్తోంది నాకు. నాతో కాస్త 'ఎక్కువ చనువుగా' ఉంటున్నట్లనిపిస్తోంది. నేను పాఠం చెబుతున్నపుడు, నావైపే నిశితంగా, గమనింపుగా, ఇష్టంగా, మంత్రముగ్ధమైనట్లుగా చూసే ఆమె చూపుల్లో భావాలు 'పెడత్రోవ' పడుతున్నాయా అన్న సందేహం కూడా కలుగుతోంది నాకు! నాకు తెల్సు ఆ 'పెడత్రోవ'కి ప్రధానంగా ఆ వయసే కారణమని!

టీనేజ్!! ది మోస్ట్ ఇంప్రెషనబుల్ ఏజ్!

ఆ వయసువాడిలో కలిగే ఉద్వేగాలకూ, వేగాలకూ, భావోద్రేకాలకూ అర్థం వుండదు. కొన్ని కొన్ని ఇన్‌ఫాచ్యుయేషన్లు అసలెలా జనిస్తాయో అంతుచిక్కదు. 'జస్టిఫయబుల్ రీజన్' అంటూ ఒకటి లేకుండానే మనసు వశం తప్పవచ్చు; చిత్రమైన అనుభూతులకు లోనవ్వచ్చు. అదంతా ఓ రకమైన టీనేజ్ – సిండ్రోమ్!

ఆ లేత మనసులో నా పట్ల (వయసులో నేనామెకన్నా ఎంతో పెద్దవాడిననీ, పెళ్ళై రెండేళ్ళ బాబు కూడా నాకున్నాడని తెల్సీ) ఏదో ఆకర్షణ లేదా ప్రేమ లేదా గాఢమైన ఇష్టం లాంటిది కలుగుతూన్నాయేమోనన్న నా అభిప్రాయం రోజురోజుకీ బలపడసాగింది. ఇది మంచి పరిణామం కాదని నాకు తెల్సు. ఆ వయసు తాలూకూ 'వల్‌నరబిలిటీ'కి ఆ పాప గురికాకూడదు. మానసిక పరిపక్వత సరిగా వుండని ఆ పాప మనసులోని "నా పట్ల క్రేవింగ్ పెంచుకోవడం" అనే ఓ సైకో ఫ్యాన్సీని మొగ్గగా వున్నప్పుడే చిదిమివేయాలనుకున్నాను. కానీ ఆ 'చిదిమివేయడం' అనేదాన్ని ఎలా చేయాలో సరిగా తెలీడం లేదు.

XXX

ఆ రోజు ఉదయం 'ఆంధ్రజ్యోతి' దిన పత్రిక చదువుతూంటే ఓ చిన్ని కాలమ్ నా దృష్టిని ఆకర్షించింది. ఆ న్యూస్ ఐటమ్‌కి "రేపే రాఖీ పండుగ" అన్న పేరు పెట్టారు.

అదంతా చదివాక, ఫ్లాష్‌లాంటి ఆలోచన నాలో కలిగింది. చాలా చిన్ని ప్లాన్ అది. అదేంటంటే, ఈ వేళ అపూర్వ రాగానే ఆమెతో ఇలా చెప్పాలి:

"ఏం అపూర్వా? రేపు నేను నీకిచ్చే 'కానుక'తో ఏం కొనుక్కుంటావ్?" నా ప్రశ్న అర్థంకాక, "ఏవిటి రేపు?" అని అడుగుతుంది.

"రేపు రాఖీ పండుగ కదా. రక్షాబంధన చేసిన చెల్లాయి చేతిలో ఎంతో కొంత వుంచడం సాంప్రదాయం కదా?" అని అప్పుడు జవాబు చెప్తాను.

అంతే – ఆ మాటతో నా పట్ల ఆమె పెంచుకుం(టుందనుకుం)టున్న 'ఆ ఆసక్తి' కాస్తా అణచివేయబడుతుంది. ఆమెకది ఆ క్షణంలో షాకింగ్‌గా అనిపించినా, ఆమెలోని టీనేజ్ – సిండ్రోమ్‌కి ఓ 'థెరపీ'లా కూడా పని చేస్తుందనిపించింది. ఆ 'ప్రణాళిక' నాకు బాగా నచ్చింది. వెంటనే దాన్ని ఆచరించాలని నిశ్చయించుకున్నాను!! ఏడున్నరకి వచ్చింది అపూర్వ నోట్ బుక్స్‌తో, ఆ రోజు 'పాఠం' కోసం!!!

XXX

ఆ రాత్రి, పన్నెండైనా నాకు నిద్ర రావడం లేదు. పక్కలో శ్రీమతి, బాబు వత్సల్ నిద్రపోతున్నారు. ఉదయం అపూర్వ రాగానే అమలుపరచాలనుకున్న ఆ 'ప్లాన్'ని నేనెందుకు అమలుపరచలేకపోయానన్నదాని గురించే నా ఆలోచనంతా కేంద్రీకృతమై వుంది. లోతుగా ఆలోచించేకొద్దీ, ఎక్కడో మనస్సట్టడుగు పొరల్లో అస్పష్టంగా కదలాడుతున్న ఓ భావన క్రమంగా బయటికొస్తున్నట్లనిపిస్తోంది. అంతకు ముందే పెళ్ళయి, ఓ బాబుకి తండ్రినయిన నేనంటే ఓ టీనేజ్ అమ్మాయి ఇష్టం పెంచుకోవడం అన్న నిజం(?) నా "మిడిల్ ఏజ్ – మనస్తత్వం" మీద స్టిములేటింగ్ ఎఫెక్ట్ చూపిస్తోందా? ఆ అమ్మాయి నా పట్ల 'ఆసక్తి' కనబర్చడాన్నీ, వర్‌షిపింగ్‌గా ట్రీట్ చేయడాన్నీ సబ్‌కాన్షస్‌గా నేను ఇష్టపడుతున్నానా?

ప్రొద్దుట వార్తాపత్రికలో 'రాఖీ పండుగ' గురించి వ్రాసిన దాన్ని చూశాక కలిగిన 'ఆ ప్లాన్'ని అపూర్వ దగ్గర (ప్రయత్నపూర్వకంగా) అమలు పర్చకపోవడం వెనుక వున్న కారణం "ఇదేనా"?

"అవును. ఖచ్చితంగా ఇదే" అన్న సమాధానం వైపే నా మనసు మొగ్గుచూపడం స్పష్టంగా అవగతమౌతూంది!! ఆలోచనలనాపి బలవంతంగా కళ్ళు మూసాను. మూసిన ఆ కనురెప్పల మాటుకి, 'విచ్చుకుంటూన్న మొగ్గ'లాంటి అపూర్వ రూపం వచ్చి చేరింది అప్రయత్నంగా... మొట్టమొదటిసారిగా!!!

XXX

రాత్రి చాలా ఆలస్యంగా పడుకున్నా మామూలుకన్నా ముందే లేచి స్నానం అదీ కానిచ్చాను.

"ఏమిటీరోజు ప్రొద్దుటే శ్రద్ధగా అద్దం ముందు నిల్చుని ఏకధాటిగా సౌందర్యారాధన కానిస్తున్నారు శ్రీవారు"

నా భార్య క్యాజువల్‌గానే అన్నా ఆ మాట సూటిగా ఎక్కడో తగిలినట్లనిపించింది. నిజానికి, ఆమె అలా అన్నప్పుడుగానీ తెల్సుకోలేకపోయాను – రొటీన్‌కి భిన్నంగా ఎక్కువసేపు అద్దం ముందు నిల్చున్న సంగతి! రాత్రి నా మనసులోని అంతర్మథనాన్ని దొంగచాటుగా నా భార్య 'చూసేసిందేమో'నన్న భావన కలిగి క్షణంసేపు తత్తరపడిపోయాను.

అంతలో కాల్ బెల్ మ్రోగింది.

"అదిగో మీ స్టూడెంట్ వచ్చినట్లుంది. ఇంక చాలించి పాఠం మొదలుపెట్టండి" కిచెన్‌లో నుంచే చెప్పింది శ్రీమతి.

హుషారుగా వెళ్ళి తలుపు తెరిచి 'రా' అన్నాను.

ఆకుపచ్చ పరికిణీలో పిల్లగాలికి ఊగే

# ప్రిమిటివ్ లవ్



గుమ్మడి రవీంద్రనాథ్

వరి వెన్నులా వుంది అపూర్వ. తలం టుకున్నట్లుంది. ఆ పిల్ల సౌందర్యం నిజంగా అపూర్వమే!

లోపలికడుగు పెడ్తూనే నా చేయి పట్టుకుని చమ్కీలతో ధగధగలాడ్తున్న అందమైన రాఖీని నా ముంజేతికి ముడివేసేసింది!

ఊహించని ఆ చర్య నన్ను గాఢ మైన దిగ్భ్రమలో పడేసింది. సరిగా వ్యక్తీకరించలేని "ఓ విధమైన షాక్"తో గొంతు మూగవోయింది!

"ఈ వేళ రాఖీ పండుగ అంకుల్. ఈ రాఖీని నేను బజార్లో కొన లేదు. నా చేతులతో నేనే స్వయంగా తయారుచేశాను – నాలుగు రోజుల క్రిందటే. స్పాంజ్, రంగు దారాలూ, ప్లాస్టిక్ చమ్కీలు కొని నేనే సొంతంగా చేశాను, మీ కోసం. అమ్మలోని మొదటి అక్షరం, నాన్నలోని చివరి అక్షరం కలిపితే 'అన్న' అవుతుంది. ఇక నుండి మిమ్మల్ని నేను అలానే పిలుస్తాను"!

అపూర్వ మాటల్లోని ఒక్కో అక్షరం నన్ను సిగ్గుతో కుంచించుకుపోయేలా చేస్తోంది.

అప్పటి నా మానసిక స్థితిని వర్ణించ గల మాటలు ఏ నిఘంటువుల్లోనూ దొరకవేమో.

అపూర్వ నా నోటికి స్వీట్ అందిం చింది.

షర్ట్ జేబులోంచి చేతికందినన్ని నోట్లని తీసి ఆ పాపకి ఇస్తుంటే అప్ర యత్నంగా నా కంట్లోంచి ఓ కన్నీటి బిందువు వెచ్చగా బుగ్గల మీదికి జారి పోయింది!!